క్లుప్తంగా

వెలుగు సిబ్బంది సేవలు కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ లక్ష్మీపతి

ఎంవీపీ కాలనీ: గ్రామాభివృద్ధి ప్రణాళిక అమలులో వెలుగు సిబ్బంది సేవలు కీలకమని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై వెలుగు సిబ్బందికి శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక అమలుకు అనుగుణంగా సిబ్బంది చేపట్టాల్సిన చర్యలు, కార్యాచరణను వివరించారు. గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలను, సంఘాల మహిళలను భాగస్వాములను చేయాలన్నారు. వారిని గ్రామాభివృద్ధికి ప్రోత్సహించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శిక్షణ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల ప్రాజెక్టు అధికారులు, కమ్యూనిటీ కో – ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను రెన్యువల్ చేయాలి



మాట్లాడుతున్న అతిథి అధ్యాపకులు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలో అతిథి అధ్యాపకులకు కూడా ఇతర యూనివర్సిటీల్లో మాదిరిగా రిన్యూస్ నిర్వహించాలని అతిథి అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏయూలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భవిష్యత్ కార్యాచరణపై అతిథి అధ్యాపకులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఎస్వీ, అంబేడ్కర్, నాగార్జున, నన్నయ యూనివర్సిటీల్లో అతిథి అధ్యాపకులకు రిన్యూస్ నిర్వహించి రెన్యువల్ చేశారని తెలిపారు. ఇదేవిధంగా ఏయూలో కూడా చేపట్టాలని వీసీని కోరారు. అతిథి అధ్యాపకులను ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఒక గంట క్లాస్‌కు కనీసం రెండు, మూడు గంటల ప్రిపరేషన్ అవసరమవుతుందన్నారు. తమకు ఇంటర్వ్యూ షెడ్యూల్ కూడా ఇంకా విడుదల చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎన్ని అప్లికేషన్లు వచ్చాయని ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా సమాచారం లేకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్, తుల్లి చంద్రశేఖర్, ఫణి, త్రినాథ్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈమా లైమ్ లైట్ అవార్డ్స్ వేడుక నేడు



మాట్లాడుతున్న ఈమా అధ్యక్షుడు సందీప్

ఎంవీపీ కాలనీ: ఈవెంట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో బుధవారం ఈమా లైమ్ లైట్ అవార్డ్స్ ప్రధానోత్సవం నిర్వహించనున్నారు. ఈ వివరాలను మంగళవారం గాదిరాజు ప్యాలెస్‌లో ఈమా ప్రతినిధులు వెల్లడించారు. ఈమా అధ్యక్షుడు సందీప్ కుమార్, కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ ఈవెంట్స్ రంగంలో ప్రతిభావంతులైన యాంకర్లు, సింగర్లు, డ్యాన్సర్లు, సాంకేతిక నిపుణులకు ఈమా లైమ్ లైట్ అవార్డులను ప్రధానం చేస్తామన్నారు. ఈ ఏడాది గాదిరాజు ప్యాలెస్ వేదికగా బుధవారం వేడుక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సినీ నటుడు సమీర్, కామాక్షి క్రాఫ్ట్స్ అధినేత వెంకట్, గాదిరాజు ప్యాలెస్ జీఎం మధు, ఈమా సభ్యులు కామేష్, సురేష్‌కుమార్, రాజు, సంతోష్‌కుమార్, ఆనంద్ మోహన్, ఆశ పట్నాయక్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

బీచ్‌రోడ్డు: టీకాల ద్వారా నివారించగల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడానికి బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని లోటస్ హాస్పిటల్స్ డాక్టర్ కె.శేషగిరి అన్నారు. ఆస్పత్రిలో టీకాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, ఆ రోగనిరోధక శక్తి కాలక్రమేణా బలహీనపడుతుందన్నారు. అందుకే పిల్లలకు నాలుగు నుంచి ఆరు సంవత్సరాల మధ్య రక్షణను మరింత బలోపేతం చేసేందుకు టీకాలు వేయించాలని సూచించారు.

పార్కు నిర్మాణంలో మతలబు

- భగత్‌సింగ్ నగర్‌లో జీవీఎంసీ అధికారుల జిమ్మిక్కు
- టీడీపీ నాయకుడి కోసం కొంత స్థలం వదిలేసిన అధికారులు
- రహదారి ఆక్రమించి షెడ్ నిర్మించేసిన సదరు నాయకుడు
- వదిలేసిన పార్కు స్థలాన్ని రోడ్డుగా వాడుకోవాలని స్థానికులకు హుకుం



టీడీపీ నాయకుడి ఇంటి ముందు రహదారిని ఆక్రమించి వేసిన రేకుల షెడ్



భగత్‌సింగ్ నగర్‌లో నిర్మిస్తున్న పార్కు

ఆరిలోవ: ఖాళీ స్థలంలో పార్కు నిర్మాణం ఓ టీడీపీ నాయకుడికి కలిసొచ్చింది. ముఖ్యంగా జీవీఎంసీ అధికారుల జిమ్మిక్కుతో అక్కడ దశాబ్దాలుగా ఉన్న రహదారి పూర్తి మూతపడిపోయింది. ఆ రోడ్డును ఎమ్మెల్యే పేరు చెప్పుకుని టీడీపీ నాయకుడు ఆక్రమించేసి షెడ్డు నిర్మించుకుని కారు, వాహనాల పార్కింగ్ కోసం వాడుకుంటున్నాడు. స్థానికుల రాకపోకల కోసం ఆ రహదారికి ప్రత్యామ్నాయంగా అధికారులు పార్కు స్థలంలో కొంత విడిచి పెట్టేశారు. ఇదీ జీవీఎంసీ పదమూడో వార్డులో ఓ టీడీపీ నాయకుడి ఇంటి ముందు బాగోతం. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి భగత్‌సింగ్ నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెనుక సుమారు 1,300 చదరపు గజాల వరకు జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో రహదారి కోసం విడిచిపెట్టగా మిగిలిన దానిలో స్థానికుల కోసం పార్కు నిర్మాణం చేపట్టాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 నవంబరులో ప్రతిపాదనలు చేసింది. జీవీఎంసీ అధికారులు అక్కడ 964 చదరపు గజాల విస్తీర్ణంలో పార్కు నిర్మించడానికి రూ.33.85 లక్షలు కేటాయించారు. నిర్మాణ పనులు చేపట్టదలచిన సమయంలో 2024 సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి.

అధికారులను ప్రసన్నం చేసుకుని...

అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవీఎంసీ అధికారులు సుమారు ఆరు నెలల క్రితం ఇక్కడి పార్కు నిర్మాణ పనులు ప్రారంభించారు. అంతవరకు బాగానే ఉంది. ఆ పార్కు స్థలాన్ని దానికి ఎదురుగా నివాసముంటున్న ఓ టీడీపీ నాయకుడు సొమ్ము చేసుకున్నాడు. దశాబ్దాలుగా ఇంటి ముందు ఉన్న సీసీ రోడ్డును ఆక్రమించి రేకుల షెడ్ నిర్మించేసి కారు పార్కింగ్, కారిడార్‌గా వినియోగించుకుంటున్నాడు. అధికారులను ఆయన ప్రసన్నం చేసుకుని పార్కు స్థలాన్ని రోడ్డు కోసం విడిచి పెట్టించేశాడు. నేను 'లోకల్ ఎమ్మెల్యే తాలూకా' అని చెప్పడంతో అధికారులు ఆయనకు అనుకూలంగా వ్యవహరించారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయన ఆక్రమించిన రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం... దానికి ఇరుపక్కలా కాలువలు ఉన్నాయి. అయినా ఆ రోడ్డును టీడీపీ నాయకుడు సొంతానికి వినియోగించుకుంటే అధికారులు పార్కు స్థలాన్ని రహదారి కోసం విడిచిపెట్టడం విశేషం.



ఖాళీగా విడిచిపెట్టేసిన పార్కు స్థలం

సుమారు 100 చదరపు గజాలు వృథా

భగత్‌సింగ్ నగర్‌లోని 964 చదరపు గజాలలో సుమారు 100 చదరపు గజాల స్థలాన్ని అధికారులు టీడీపీ నాయకుడికి మేలు చేసేందుకు మినహాయించేశారు. మిగిలిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. లోపల అభివృద్ధి పనులు ఇంకా జరుగుతున్నాయి. పార్కు ఎదురుగా టీడీపీ నాయకుడి నివాసం ముందు నుంచి సుమారు 20 ఏళ్లగా సీసీ రోడ్డు ఉంది. దానికి ఓ పక్క కాలువ, మరో పక్క విద్యుత్ స్తంభం ఉన్నాయి. ఆ నివాసం అక్కడ రోడ్డుకు చివరన ఉండడంతో సదరు టీడీపీ నాయకుడు స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పుకుని జీవీఎంసీ అధికారులను ప్రసన్నం చేసుకున్నాడు. దీంతో అధికారులు పార్కు స్థలాన్ని కొంత విడిచిపెట్టి నిర్మాణం చేసుకుపోతున్నారు. గతంలో ఉన్న రోడ్డును టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని రేకుల షెడ్ నిర్మించుకోవడంతో అక్కడ విడిచిపెట్టిన పార్కుకు చెందిన ఖాళీ స్థలాన్ని స్థానికులు రహదారిగా వినియోగించుకోవాల్సి వస్తోంది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. సదరు టీడీపీ నాయకుడు ఎమ్మెల్యే పేరు చెప్పి రోడ్డును ఆక్రమించేశాడని... వేరే దారిలేక పక్కదారిలో వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దృష్టి లోపాలపై అప్రమత్తత అవసరం

ఆరిలోవ: మయోపియా దృష్టి లోపాలపై అప్రమత్తత అవసరమని వైద్యులు సూచించారు. హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో కంటి సమస్యలతో వెళ్లిన వారికి మంగళవారం మయోపియో దృష్టి లోపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.లక్ష్మీ కౌసల్య మాట్లాడుతూ మయోపియో సమస్య పిల్లల్లో వేగంగా పెరుగుతుందన్నారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లల కంటి చూపును ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ సమస్య పెరిగితే అంధత్వం వస్తుందని హెచ్చరించారు. ఈ సమస్యతో బాధపడుతున్న వారు దూరంగా ఉన్న వస్తువులను స్పష్టంగా చూడలేరన్నారు. దీనివల్ల పిల్లలకు తరగతి గదుల్లో వెనుక కూర్చున్నప్పుడు బోర్డుపై అక్షరాలు స్పష్టంగా కనిపించవన్నారు. అలాంటప్పుడు ఉపాధ్యాయులు వారిని పరిశీలించాలన్నారు. అలాంటి పిల్లలకు కళ్లు తిరగడం, తరుచూ కళ్లు రుద్దడం, పుస్తకాలకు, స్క్రీన్‌కు ముఖం దగ్గరగా పెట్టుకోవడం, తరగతిలో బోర్డు చూడటంలో ఇబ్బందిపడటం తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ వ్యాధి జన్యుపరమైనది కావడంతోపాటు జీవనశైలి కూడా కారణమన్నారు. పిల్లలు సెల్ ఫోన్లు చూడటం తగ్గించాలని, ఏకధాటిగా ఎక్కువ సేపు పుస్తకాలు చదవకూడదని సూచించారు. కొంత సమయం బహిరంగ ప్రదేశాల్లో ఆడుకోవడం మంచిదని సూచించారు.

పెద్దలను వదిలి... పేదలపై పోలీసుల ప్రతాపం

చిరు వ్యాపారులకు పెనాల్టీలు

మధురవాడ: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు పెద్దలను వదిలి రోడ్డు పక్క సాయంత్రం పూట చిరు వ్యాపారులు చేసుకుంటున్న వారిపై తమ ప్రతాపం ప్రదర్శిస్తున్నారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో చిరు వ్యాపారుల వివరాలు సేకరిస్తూ పెట్టీ కేసులు విధిస్తామంటూ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, ఇతర సిబ్బంది మంగళవారం సాయంత్రం హడలెత్తించారు. దీంతో వ్యాపారులు ఎప్పుడూ లేని కొత్త పద్ధతుల్లో కేసులు రాస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వీరు రోడ్డు పక్క ప్రైవేటు స్థలాల్లో ఉన్నవారికి పెనాల్టీలు విధించడం విశేషం. ఈ రోడ్డులోనే హైవే మొదలు గాంధీ విగ్రహం వరకు పదుల సంఖ్యలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, బ్రాందీ షాపులు, హోటల్స్, బార్లు ఉన్నాయి. వాటిలో అధిక భవనాలకు సెల్లార్ పార్కింగ్ లేదు. బడా వ్యాపారులు, నోరున్న, రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులే ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పాటు వాటిపైనే దుకాణాలు ఏర్పాటు చేసి, నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కానీ వారిపై చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించాలి. కానీ ఆ దిశగా చర్యలేవీ లేకపోవడం గమనార్హం.

గిరిజన విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థినులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 10లోని గిరిజన బాలికల హాస్టల్ ప్రాంగణంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. 300 మంది విద్యార్థినులకు 2 వేల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత అవకాశాలు, అభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన విధంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి సమాజ మార్పునకు నాంది పలకాలన్నారు. 'పే బ్యాక్ టు సొసైటీ' సిద్ధాంతంలో భాగంగా రెండు అసోసియేషన్ల ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి దేవీశ్వరరావు, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామలింగం, కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న సభ్యులు

కూటమి ప్రభుత్వం హామీలు విస్మరించింది

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 22వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు గడప గడపకు వెళ్లి అమలు చేయలేని హామీలిచ్చి మోసం చేశారన్నారు. ప్రతీ ఇంటికి సంవత్సరానికి లక్షలాది రూపాయలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని... ష్యూరిటీగా బాండ్లు కూడా ఇస్తున్నామని నమ్మించి ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని కోరారు. ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పేలా నూతన ఉత్తేజాన్ని నింపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, సురిశెట్టి రావాలు, శశికళ, ఈశ్వరరావు, సంపంగి సురేష్, వెంకటరావు, మహేష్, సూరిబాబు, అప్పలనాయుడు, అప్పారావు, దాసు, పైడి శ్రీను, మురళి, శ్యామ్, గోవిందమ్మ, లక్ష్మి, అన్నపూర్ణ, భాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ఘనంగా బంగారమ్మ తల్లి ఉత్సవం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి దారపాలెంలో బంగారమ్మ తల్లి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమతో పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దారపాలెం, పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, రామకృష్ణాపురం గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సంపంగి వాసు ఆధ్వర్యంలో పైనాపిల్‌కాలనీలో చేపట్టిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ తూర్పు మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, స్థానిక నాయకులు సత్యాల వెంకట్, కె.సుబ్బారావు, బి.దుర్గారావు, భాస్కర్, పోలారావు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు

నకిలీ పట్టాలపై దర్యాప్తు

- 2002లో రెండు ఫోర్జరీ పట్టాల సృష్టి
- వాటి ఆధారంగా జీవీఎంసీ నుంచి ప్లాన్
- జీవీఎంసీ 11వ వార్డులో వివాదాస్పదంగా భవన నిర్మాణం

ఆరిలోవ: జీవీఎంసీ పదకొండో వార్డులో 15వ నంబరు సచివాలయం పరిధిలో ఫోర్జరీ పట్టాల ఆధారంగా చేపట్టిన నిర్మాణం వ్యవహారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక, రూరల్ రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. దీని విషయంలో కొందరు టీడీపీ నాయకుల ఒత్తిడితో ఆయా విభాగాల అధికారులు ఇంతవరకు చూసీచూడనట్లు వదిలేశారు. దీనిపై ప్రసార మాధ్యమాల్లో రావడం, స్థానికులు గ్రీవెన్స్‌లో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు తరుచూ ఫిర్యాదులు చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకొంటున్నారు. జీవీఎంసీ జోన్ – 2 పరిధి పదకొండో వార్డు పార్వతినగర్‌లో సుమారు 158 చదరపు గజాల విస్తీర్ణంలో ఓ వ్యక్తి మూడు ఫ్లోర్లకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల నుంచి ప్లాన్ పొందాడు. అందులో 38 చదరపు గజాలకు చంద్రన్న పట్టా ఉండగా మిగిలిన 120 చదరపు గజాల స్థలానికి 60 చదరపు గజాల చొప్పున రెండు నకిలీ పట్టాలను సృష్టించారు. ఇక్కడ బాలసాని స్వర్ణ పేరుతో ఇంటి నంబరు 13 – 718/1, బాలసాని వెంకటరావు పేరుతో ఇంటి నంబరు 13 – 718/2తో 60 చదరపు గజాల చొప్పున రెండు పట్టాలను మే 15, 2002లో చినగదిలి (రూరల్ మండలం) రెవెన్యూ అధికారులు జారీ చేసినట్లు భవనం నిర్మాణం కోసం ప్లాన్ దరఖాస్తుకు జతచేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ పట్టాలను పరిశీలించకుండానే ప్లాన్ మంజూరు చేయడంతో నిర్మాణం చకచకా జరిపించేస్తున్నాడు.

నిజానికి 2000 సంవత్సరం తర్వాత రెవెన్యూ అధికారులు ఎలాంటి పట్టాలు జారీ చేయలేదు. దీనిపై 'ఫోర్జరీ పట్టాలతో బిల్డింగ్ ప్లాన్' శీర్షికతో గత నెల 25న సాక్షిలో ప్రచురించిన కథనానికి టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి పనులు నిలిపేశారు. రెవెన్యూ అధికారులు ఫోర్జరీ పట్టాలు గురించి ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా నాలుగు రోజులపాటు పనులు నిలిపేసిన అనంతరం ఆ భవన యజమాని యథాతథంగా పనులు జరుపుకుపోవడం విశేషం.



ఫోర్జరీ పట్టాల ఆధారంగా చేపట్టిన భవన నిర్మాణం

పోలీస్ కేసులు పెడతాం



ఆరిలోవ ప్రాంతం పార్వతినగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణంలో ఫోర్జరీ పట్టాలుపై దర్యాప్తు చేస్తున్నాం. దీనిపై గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ నుంచి కూడా దీనిపై దర్యాప్తు చేయాలని ఆదేశాలు వచ్చాయి. 2000 సంవత్సరం తర్వాత ఇంటి పట్టాలు జారీ చేయలేదు. 2002లో తహసీల్దార్ సంతకం ఎవరో ఫోర్జరీ చేసి దొంగ పట్టాలు సృష్టించి ఉంటారు. దొంగ పట్టాలు సృష్టించిన వారిని గుర్తించి పోలీస్ కేసులు పెడతాం. అక్కడ భవన నిర్మాణ పనులను ఆపించడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు చొరవ చూపాల్సి ఉంది.

– పాల్‌కిరణ్, రూరల్ తహసీల్దార్

దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళలకు ఆదర్శం

విశాఖ సిటీ: స్వాతంత్య్ర సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళలకు ఆదర్శమని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నర్సింహారావు అన్నారు. ఏయూలోని డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి మంగళవారం నిర్వహించారు. ఆ సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సింహారావుతోపాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ నర్సింహారావు మాట్లాడుతూ దుర్గాబాయి ఏయూలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ చేశారని, ఆమె ఇక్కడ చదవడం వర్సిటీకి గర్వకారణమన్నారు. భారతదేశ ప్రణాళికా సంఘ సభ్యురాలుగా ఆమె సామాజిక సేవలో ముందుండేవారని గుర్తు చేశారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ వుమెన్ ఎడ్యుకేషన్‌కు మొదటి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీ తామాణిక్యం, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.పద్మశ్రీ, ఐఏఎస్ఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజ కుమారి, ఆచార్య పేటేటి ప్రేమానందం, డాక్టర్ వి.ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.



దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

ఆకాశవాణి సేవలు నిరుపమానం

దాబాగార్డెన్స్: అప్పటికీ.. ఇప్పటికీ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్న సాధనం ఆకాశవాణి మాత్రమేనని, సాంకేతికంగా, సాంస్కృతికంగా ఆకాశవాణి (రేడియో) తన సేవలందిస్తూ కొనసాగుతోందని ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం విశ్రాంత వ్యాఖ్యాత, కవి డాక్టర్ బండి సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవ కార్యక్రమంలో భాగంగా 4వ సాహిత్య సమావేశం నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిగ్నల్ అందని సముద్రం మధ్య భాగంలోనైనా మత్స్యకారులను ప్రమాదాల బారి నుంచి కాపాడగలిగేది, నాటి స్వాతంత్య్ర ఉద్యమంలో కానీ, నేటి రక్షణ రంగానికి సంబంధించిన సైన్యం పహరాలో గానీ కేవలం రేడియో మాత్రమే శత శాతం సేవలు కచ్చితంగా అందించగలిగే సాధనమని పేర్కొన్నారు. ప్రముఖ కళాకారులు, సినిమా నటులు ఆ రోజుల్లో ఎదగడానికి ఆకాశవాణి దోహదపడిందని బండి తెలిపారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడి రీడర్స్ అభివృద్ధికి, పోటీ పరీక్షలకు చాలా మేలు చేస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రీడర్లను కోరారు.

ప్రయోజనకరమైన విషయాలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సిబ్బందిని, గరిమ సాంస్కృతిక వేదికను అభినందించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ ఎఫ్ఎం రేడియోల ద్వారా ఆకాశవాణి అందిస్తున్న సేవలు వివరించారు. గరిమ సాంస్కృతిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీఎస్ నరసింహం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుష్కరోత్సవ సమన్వయకర్త సీహెచ్‌వీ సత్యనారాయణ, డీసీఎల్ డిప్యూటీ లైబ్రేరియన్ జి.తిరుమలకుమారి, రచయితలు డాక్టర కేవీఎస్ మూర్తి, బసు పోతన, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి చేయూత ఇవ్వండి

మహారాణిపేట: డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా హ్యూమన్ రైట్స్ సెల్ జాతీయ చైర్మన్ కె.రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, మహిళా అధ్యక్షురాలు ఎం.రాధాకుమారి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కేజీహెచ్‌లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో భాగంగా రూపొందించిన కరపత్రాలను ఆమెకు అందజేశారు. పలు కాలేజీల్లో త్వరలో నిర్వహించే సదస్సులకు చేయూత ఇవ్వాలని రామకృష్ణ కోరారు. అలాగే సైకాలజీ డాక్టర్లతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు.



డాక్టర్ వాణికి కరపత్రాలు అందజేస్తున్న హ్యూమన్ రైట్స్ సెల్ జాతీయ చైర్మన్ రామకృష్ణ

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి